క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

గుర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీపురుపల్లి డీఎస్పీ ఏ.ఎస్.చక్రవర్తి అన్నారు. మండలంలోని ఆనందపురంలో అంబేడ్కర్ ఇండియన్ మిషన్(ఎయిమ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిమ్ సంస్థ సభ్యులు అడ్డూరి సీతబాబు, కెల్ల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5 లక్షలతో ఇంటింట కుళాయిలు



కుళాయి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు సర్పంచ్ గొటివాడ దేవీ ఆధ్వర్యంలలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు గురువారం భూమి పూజ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రూ. 2.5 లక్షల వ్యయంతో పనులు చేపట్టి, ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా త్వరలో రక్షిత తాగునీరు అందించనున్నట్లు చెప్పారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కళాశాలకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లు మంజూరు



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ వినోద్‌బాబు

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చింది. కళాశాలకు ప్రభుత్వం రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను మంజూరు చేసింది. వీటిని వినియోగానికి సంబంధిత సిబ్బంది సిద్ధం చేశారు. ప్రిన్సిపాల్ మద్దలి వినోద్‌బాబు వాటర్ ప్లాంట్లను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శతశాతం సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కళాశాలకు రెండు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీపురుపల్లి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మూడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ కె.వి.ఎన్.రాజేశ్వరి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. చీపురుపల్లి మండలంలోని మోదుగులపేట, మెరకముడిదాం మండలంలోని బోడందరవలస, గరివిడి మండలంలోని కుమరాం-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థులు జూన్ 22 సాయంత్రం 5 గంటలులోగా ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా కానీ, పోస్టు ద్వారా కానీ దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



నాడు- నేడు పనులపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: మన బడి నాడు-నేడు పథకంలో బాగావాలిపాడు ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కె.పట్నాయక్ సూచించారు. ఆయా పాఠశాలల్లో చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలల పేరెంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేనాటికి పనులు పూర్తి చేయించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

ప్రతి ఇంటా సంక్షేమ సంతోషం



కొత్తవలస: తాడివానిపాలెంలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం' లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దేశపాత్రునిపాలెం సచివాలయం పరిధి తాడివానిపాలెం, శీరంశెట్టివానిపాలెం గ్రామాల్లో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివ రించి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. ఆయా గ్రామాల ప్రజలు తెలియజేసిన సమస్యలను సచివాలయ సిబ్బందితో నమోదు చేయించి, త్వరితగతిన వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నా మని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటిని నాలుగేళ్ల లోనే సీఎం జగన్ అమలు చేశారని, రానున్న ఎన్నికల్లో ఆయన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కొత్తవలస మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, నాయకులు ఏడువాక నారాయణ, పల్లా భీష్మ, ఎల్లపు రమణ, బొడ్డు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు

పైరవీలు, అవినీతికి తావులేదు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పైరవీలు, అవినీతికి తావులేదని, అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పెనుబర్తిలో మూడోరోజు గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందేవని గుర్తు చేశారు.ఎంపీడీఓ కల్యాణి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మగుంటి పరమేష్, రెడ్డి అచ్యుత్‌రావు, అంబల్ల చిన్నారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి, ఎన్ని ఇబ్బందులు ఉన్నా చెప్పిన తేదీకి పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్న కాలంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గజపతినగరంలోని 30 పడకల ఏరియా ఆస్పత్రిని 100 పడ కల స్థాయికి పెంచామని గుర్తు చేశారు. అలాగే రూ.17 కోట్లతో ఆస్పత్రి భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గ్రామాలకు తారు రోడ్లు వేయిస్తున్నామని, గజపతినగరం బైపాస్ రోడ్డు పనులు చేపడుతున్నామని చెప్పారు. కొట్టక్కి నుంచి గొట్లాం వరకు చేపడుతున్న జాతీయ రహదారి-26 విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయు డు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుభిల్లి కృష్ణ, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం,రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్‌లు మహంతి రమణ, గొల్లు సతీష్, మాజీ ఎంపీపీ బండారు బంగారం, ఎంపీటీసీ రాపాక వెంకటలక్ష్మి, తహసీల్దార్ డి.జి.ఎస్.ఎన్.ప్రసాద్, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ రాజ్ జేఈఈ కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ పల్లి రఘు, నాయకులు రాపాక సాయి కుమార్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను వినియోగించుకోండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- నేడు చీపురుపల్లిలో జాబ్‌మేళా

చీపురుపల్లి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం శుక్రవారం మెగా జాబ్ మేళాను ప్రభుత్వం నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు.అపోలో, టీసీఎల్, మెడ్‌ప్లస్, జయభేరి ఆటోమోటివ్స్, వరుణ్ మోటార్స్, హెటిరో, డెక్కన్, అరబిందో, గ్రీన్ టెక్ తదితర 15కు పైగా ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. అన్ని పరిశ్రమల నుంచి దాదాపు 1,700 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఇక్కడ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ చదువుకున్న యువత అర్హులని, జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు రఘుమండ త్రినాథ్, మీసాల రమణ, మీసాల ఈశ్వరరావు, మీసాల రఘు పాల్గొన్నారు.

నెలివాడ ఉప సర్పంచ్‌గా రాము ఎన్నిక



ఉప సర్పంచ్‌ను అభినందిస్తున్న నాయకులు,అధికారులు

బొండపల్లి: నెలివాడ పంచాయతీ ఉపసర్పంచ్ కోన రామబంగారయ్య ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు స్థానిక సచివాలయంలో ఉపసర్పంచ్ పదవికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణా కరరావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. 8వ వార్డు సభ్యుడు పురమనేని రాము ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉపసర్పంచ్‌కు సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు

లక్కవరపుకోట: కొట్యాడ గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో తహసీల్దార్ వి.ఆదిబాబు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది, గ్రామ మహిళా పోలీస్ గురువారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొట్యాడలో సర్వే నంబర్ 218/1లో సుమారు 20 సెంట్ల భూమిని బల్క్‌మిల్క్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించింది. ఈభూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించేందుకు సిద్ధమైనట్లు తెలియడంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించామని తహసీల్దార్ తెలిపారు.

నేడు దబ్బిరాజుపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: దబ్బిరాజుపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముమ్మలూరి జగ్గబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు హాజరు కావాలని కోరారు.

11న మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు పరీక్ష

గంట్యాడ/ వేపాడ: గంట్యాడ మండలంలోని మదనాపురం, వేపాడ మండల కేంద్రంలోని మోడల్ స్కూళ్లలో 6వతరగతిలో ప్రవేశాలకు ఈనెల 11వ తేదీన పరీక్ష పిర్వహించనున్నట్లు ప్రిన్సిపాళ్లు ఆర్.రామకృష్ణారావు, ఆర్.ఈశ్వరరావు గురువారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏపీఎంఎస్. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని సూచించారు.

గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి 14న పరీక్ష

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస మహాత్మా జ్యోతిబా పూలే బాలురు గురుకుల పాఠశాలలో ఖాళీ ఉన్న సీట్లకు ఈనెల 14న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీతారాం గురువారం ఓప్రకటనలో తెలిపారు. అలాగే అదే రోజున నెల్లిమర్ల బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని తెలిపారు.

రెండో వైస్ ఎంపీపీగా శ్రీనురాజు

లక్కవరపుకోట: మండల రెండో వైస్ ఎంపీపీగా భీమాళి ఎంపీటీసీ సభ్యులు ముదునూరు శ్రీనివాస వర్మరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీగా పనిచేసిన దండేకర్ కుమారి మృతిచెందడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.శారదాదేవి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. మండలంలోని 11 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల్లో ముదునూరు శ్రీనివాసవర్మ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. వైస్ ఎంపీపీగా ఎన్నికై న శ్రీనివాసవర్మరాజు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, పలువురు ఎంపీటీసీలు అభినందించారు. శ్రీనివాసవర్మరాజు మాట్లాడుతూ తనకు సహాయ సహకారాలు అందజేసిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాసవర్మరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పాఠశాలలకు జేవీకే కిట్ల పంపిణీ

గజపతినగరం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యాకానుక కిట్లను (జేవీకే) పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. గజపతినగరం ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు జేవీకే కిట్ల పంపిణీని గురువారం ఆమె ప్రారంభించారు. స్థానిక బాలికోన్నత పాఠశాల, బూడిపేట, దావాలపేట, లింగాలవలస, కె.ఎస్.ఆర్.పురం, గజపతినగరం ఎస్సీ కాలనీ, ఏ.ఎస్.ఎన్.ఎం స్కూల్, పాతశ్రీరంగరాజపురం, డోలపాలెం,ఎన్.జి.ఆర్ పురం, పిడిశీల,సీతారామపురం తదితర పాఠశాలలకు వీటిని పంపిణీ చేశారు. 1 నుంచి10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ యూనిఫాం, బూట్లు, షాక్సులు, బ్యాగులు, పాఠ్య, నోట్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని ఎంఈఓ చెప్పారు. ప్రతీ పాఠశాల ఉపాధ్యా యులు గజపతినగరం స్టాక్ పాయింట్ వద్దకు వచ్చి కిట్లను తీసుకువెళ్లాలని సూచించారు.

వేపాడ మండలంలో..

వేపాడ: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అందించనున్న జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్లను పాఠశాలలకు పంపిణీని ఎంఈఓ జి.శ్రీదేవి గురువారం ప్రారంభించారు. వేపాడ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి రెండు పాఠశాలలకు కిట్లు పంపిణీ చేశారు. శుక్రవారం నుంచి అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తామని, ఉపాధ్యాయులు పాఠశాలలవద్ద అందుబాటులో ఉండాలని కోరారు.



గజపతినగరం: విద్యాకానుక కిట్ల సరఫరా వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ విమలమ్మ



వేపాడ: జేవీకే కిట్ల పంపిణీ వాహనాన్ని ప్రారంభిస్తున్న వేపాడ ఉన్నత పాఠశాల హెచ్ఎం వల్లీ, సీఆర్పీలు

సంక్షిప్తంగా..

తాగునీటి పైపులైను పనులు అడ్డగింత

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీలోని 202 కాలనీ నుంచి సమీపంలోని వసంత్ విహార్ ప్రైవేట్ లేఅవుట్‌కు వేస్తున్న తాగునీటి పైపులైన్ పనులను 202 కాలనీ వాసులు గురువారం అడ్డుకున్నారు. కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి గతంలో కొత్తవలస నుంచి ప్రత్యేక పైపులైను వేసి కాలనీలో ట్యాంక్‌కు నీటిని నింపి అక్కడి నుంచి సరఫరా చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం అదే ట్యాంక్ నుంచి వసంత్ విహార్ లేఅవుట్‌కు నీటిని అందించే ఏర్పాట్లు చేస్తున్నారని, ఇక్కడి నుంచి నీటిని తరలించుకుపోతే తమకు ఇబ్బందులు తప్పవని అన్నారు. పైపులైన్ కోసం తారు రోడ్డును తవ్వేశారని మండిపడ్డారు. పనుల చేస్తున్న ప్రదేశానికి కాలనీ వాసులు వెళ్లి పనులను నిలిపివేయించారు.

కనిమెరకలో 'ఫ్యామిలీ డాక్టర్'

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జె.ఝాన్సిలక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నిర్వహించిన శిబిరంలో ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. 89 మందికి వైద్యాధికారి వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేశారు.

17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు

కొత్తవలస: అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఈనెల 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ) వైద్యులు గోపాలకృష్ణ, సింహాద్రినాయుడు తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్లను పీహెచ్‌సీలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలను అతిసారం(విరోచనం, వాంతులు) నుంచి ఏ విధంగా రక్షించుకోవాలో, ఏ మందులు వాడాలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పిల్లలకు భోజనం పెట్టే తల్లులు ముందుగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ సిబ్బది పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

రోడ్డు విస్తరణకు ప్రత్యామ్నాయం చూడాలి

లక్కవరపుకోట: అరకు–విశాఖ జాతీయ రహదారి విస్తరణకు ప్రత్యామ్నాయం చూడాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డేగల అప్పలరాజు ఆధ్వర్యంలో ఎల్.కోట సీతారామపురం,ఎల్.కోట, సోంపురం గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఇప్పటికే పలు ప్రభుత్వ సంస్థలకు తమ భూములు కేటాయించామని, మళ్లీ ఈ రోడ్డు విస్తరణకు మరింత భూమి కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ప్రత్యామ్నాయం చూడని యెడల భూములు కోల్పోయే రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్ వి.ఆదిబాబుకు వినతిపత్రం అందజేశారు.

ముగ్గురు హెచ్‌ఎంలకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలోని మూడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు బదిలీ అయిందని ఎంఈఓ ఎం.వెంకటరావు గురువారం తెలిపారు. పెదమానాపురం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీను బొబ్బిలి మండలం గొల్లాది, గడసాం పాఠశాల హెచ్‌ఎం నాగమణి గజపతినగరం మండలం మరుపల్లి, దత్తి హెచ్‌ఎం ఈశ్వరరావు పాచిపెంట ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

ఆధ్యాత్మిక సందడి



జామి: అట్టాడలో రామాలయానికి ముర్రాటలతో బయలుదేరిన మహిళలు

వేపాడ: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వ హించారు. ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం విశేష పూజలు చేశారు. అనంతరం వేద పండితులు స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు. వేపాడ వాసులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, కల్యాణం వీక్షించారు.

వినాయక ఆలయ వార్షికోత్సవం

బానాది గ్రామంలో కార్యసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మేడపాటి కిశోర్ శర్మ స్వామివారికి అష్టోత్తర శతనామ పూజ, పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



వేపాడ: నూకాలమ్మ ఆలయనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, గ్రామపెద్దలు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో నూకాలమ్మ ఆలయ నిర్మాణానికి ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, గ్రామపెద్దలు కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామపెద్దలు నౌడు శ్రీను, దొగ్గ భాస్కరరావు, వార్డు మెంబర్ గంగ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: వేంకటేశ్వరస్వామికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



వేపాడ: బానాది వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

రామాలయ ప్రతిష్ఠ

జామి: మండలంలోని అట్టాడ గ్రామంలో సీతారాముల ఆలయ ప్రతిష్ఠను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మహిళలు బిందెలతో ముర్రాట పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.